# ఇద్దరు ఖైదీలు



"వంశ వృక్షాన్ని బట్టి చూస్తే మా వంశానికి మూలపురుషుడు సూర్యుడు. నేను ఆ వంశపు రాజుల్లో ఒకడిని. నా తల్లిదండ్రులు నన్ను చాలా గారాబంగా పెంచారు. పెద్ద వాడినయ్యాక ఒక రంగుల రమణిని వెదికి వివాహంచేసి, రాజ్యం పట్టం గట్టారు. వారి కాలంలో ప్రజలు సుఖంగానే ఉన్నారు. వారు చనిపోతూ చెప్పిన మాటలు ఇంకా నా శ్రవణాల్లో నినదిస్తున్నయి. అవి 'నాయనా! మనం సూర్యవంశపు రాజులం; నీవు తప్పుగా ప్రవర్తించి వంశానికి కళంకం తేకు. పుత్రుడివై పుట్టినందుకు మాకు కీర్తిని తీసుకురా' అని. "నేను నా పితృదేవుల సౌకర్యాలు, పన్నులు యథా తథంగా ఉన్నంతవరకూ స్వర్గ వాసులయిన వారి కీర్తి విషయిక వ్యాఖ్యలేమీ వినపడలేదు. వెంటనే సౌకర్యాలు కొన్ని తగ్గించి, పన్నులు హెచ్చించాను. మరుసటి దినంనుండే ప్రతినోటా 'పోయిన రాజు గారే ధర్మాత్ములు' అనే మాటలు వెలవడినయి.



Scanned with CamScanner

"దివంగతులయిన వారికి సత్కీర్తి తీసుకురావటానికి ఈ యుక్తిని నేను మా నాన్నగారి నుండే వారసత్వంగా పొందినా... మా తాతగారి పేరు పలువురి నోటా వినాలనే కాంక్షతో మా నాన్న తన కాలంలో చేసిన యుక్తి ఇంకా నా కన్నుల్లో కదులుతూవుంది. ఆ దృశ్యానికి ప్రతిరూపమే నే నాచరించిన స్వరూపం. ఈ యుక్తే మా వంశ పారంపర్యంగా వస్తూంది. ఇక నాకు తెలిసినంత వరకూ ఏమీ చెడుగా ప్రవర్తించనందువల్ల మా తేజమేమీ చెదరలేదనే నా ఊహ.

"నాకు స్వార్థంకై పాటుపడాలని లేదు. నేను చేసిన ప్రతి పనీ ఇతరులకొరకే నా హయాంలో కీర్తింపబడాలనే దురాశ ఏమీలేదు. ఈ భారమంతా నాకు జనించే సుపుత్రులది. వాళ్ళే నిర్వహించుకుంటారు. నేను మా నాన్నకు కొడుకు నయినట్లు వాళ్లూ నాకు కొడుకులయితే, నాకు కీర్తిని సంపాదించి పెట్టి పరలోకంలో ఉండే నా ఆత్మకు శాంతికూరుస్తారు, ఇవన్నీ ముందుమాటలు.

"నా రాజ్యకాలంలో నేను చేసిన గొప్ప పనులెన్నో ఉన్నాయి. మా పితామహుని కాలంలో కవులందరూ ప్రకృతి శోభల్ని, దైవిక శక్తుల్ని, కనీ వినీ యెరుగని కథల్ని చిత్రిస్తూ తమ కావ్యాలనల్లారు. ఆయన పాతకాలపు మనిషి కనుక సరిపోయింది. ఇతర కళాకారులందరూ స్వేచ్ఛగా విహరించారు.

నాన్న ఒక నగ్నసత్యాన్ని గ్రహించి, కవుల కలాలను వేరు పంథాకు మళ్ళించారు. ప్రజలకు ప్రభువును మించిన దేవుడే లేడు. ప్రభువే సృష్టి; సృష్టే ప్రభువు. అలాంటప్పుడు తమను విడిచి దేనిపైనో కల్లబొల్లి కథ లల్లుకోవటం దేనికని తమపైనే వారి కావ్యాల్ని వ్రాయమని కవులకు నిర్దేశించారు.

తమ పిచ్చిని వెళ్ళబోసుకోటానికి ఇతర వస్తువులను తమ కావ్యమూలాలుగా తీసుకుంటే తీసికోవచ్చు. కాని తన కావ్యానికి గౌరవం కావలసిన కవి ప్రభువుయొక్క కార్య కలాపాల్ని తమ కావ్య వస్తువుగా రచించటం ఆవశ్యకం. దీనిని పాటించనివాడు తన కవితను ఏ గోడలకో, మూఢులకో వినిపించుకోవాల్సిందే. అయినా కొందరు జ్ఞానశూన్యులు ఈ నిబంధనను ధిక్కరించి తమ పోకడలే తాము పోయారు. ఇతర కళాకారుల విషయంలో గూడా ఇంతే జరిగింది.

"కాని నాకాలంలో మాత్రం ఇటువంటి అవకతవకలకేమీ తావివ్వలేదు. మా నాన్నగారినంటి తిరుగుతున్న మా తాతగారి పాతకాలపు ఛాయలు నానుండి పూర్తిగా తొలగిపోయినయి. కవులు తమ కలంలోని బలాన్ని నాకొరకే వినియోగించేట్లు శాసించాను. నా శాసనాన్ని ధిక్కరించిన వారిని రాజ్యంనుండి బహిష్కరించాను.



Scanned with CamScanner

ఎంతకూ పట్టునీడక ప్రజానీకంలో విప్లవం లేవదీయ ప్రయత్నించినవారికి శ్రీ కృష్ణజన్మస్థానాలు శాశ్వత నివాసాలుగా బహూకరించి తృప్తిపరచాను. ఒక్క కవులకే గాదు; గాన, నాట్య, చిత్ర శిల్పకళల్లాంటి అరువదినాలుగు కళాపూర్ణులకు గూడా ఇదే చేశాను. ప్రతి స్వరంలో నాకీర్తి రవళించాల్సిందే; ప్రతి చిత్రంలో నా అంగాల రంగు తొంగిచూడాల్సిందే.

ప్రతి శిల్పంలో నా దేహపు వంపులుండాల్సిందే; నృత్యంలోని ప్రతి భంగిమలోనూ నా కార్యకలాపాలు ప్రతిబింబించాల్సిందే. నిత్యం ప్రజలకు ప్రభువును అర్చించాలని హెచ్చరించాను. ఇదంతా నాకొరకుగాదు; ప్రజలకొరకే. ప్రభుభక్తి ద్వారా వారిగళాల్లో నా పితృదేవుల కీర్తిరవళించి అది దేవునికి అర్పితమై, వారికి ముక్తిద్వారాన్ని తెరవాలని నా ఆకాంక్ష.

"ఇంత చేసినా మూఢ ప్రజానీకం నా ఆశయాల నర్థం చేసు కోలేకపోయింది. కొందరు జ్ఞానశూన్యులు అక్కడక్కడ అల్లరులు రేగించ పూనుకున్నారు. కవులు ప్రబంధ, పౌరాణిక శైలి వ్రాయటం చేతగాక భావకవిత్వమనీ, అభ్యుదయ కవిత్వమని పేర్లుపెట్టి కల్లమాటలతో ప్రజలను పిడికిటిలో బిగించ సమకట్టారు. పురాతనకళను సాధించటం శక్తికి మించిన దగుటవల్ల, తమ పిచ్చి గీతలకు రూపాలు కల్పించి బీద ప్రజలను వాటిలో చూపి, రాచరికానికి వైరుధ్యంగా బందిపోటు దొంగలను తయారుచేసి ఆ ముఠాలను 'సామ్యవాద ప్రజాసంస్థ' అనే బురఖా తొడిగించి విడిచారు. ఇలాగే ప్రతివాడూ తను చేస్తున్నది సమంజసమా, కాదా? అనే ఆలోచనకు తావివ్వకుండా 'నలుగురితో నారాయణా' అన్నట్లు 'గొర్రెదాటుడు' దాటారు. ప్రజలంతా అజీర్తితో బాధపడకుండా నియమిత పరిమాణ భోజనం చేయాలని శాసిస్తే దాన్నర్థం చేసికోలేక ఒక అజ్ఞాని 'పుష్కలభోజనం కావాలి' అని ఎలుగెత్తి అరచా డొకమూలనుండి.

"ఈ అల్లరివాళ్ళ చిల్లరపనులు తెలిసికొని సమకాలిక రాజెవడో లాభం పొందజూచి నా రాజ్యంపై దండెత్తాడు. నా విషయమై దుష్ప్రచారం సాగించి ప్రజలలో ప్రభుభక్తిని నశింప జేసిన కొందరు నాయకుల మూలంగా ఎవరూ యుద్ధంలో సహాయపడలేదు. ప్రజాసహాయనిరాకరణవల్ల నాకు సమరంలో అపజయం పొందాల్సి వచ్చింది. పరరాజు నన్ను బందీచేసి ఈ చెరసాలలో బడవేశాడు. అయినా, ఈ సృష్టి నా కనుకూలం కాక పోదు. నా వలన లాభాల్నిగుర్తించి ఏనాడయినా విడుదల గావిస్తుంది. తప్పకుండా. ఇది నా చివరి నమ్మకం." అంటూ తనగాథను వివరించాడు. క్రిందిటి రోజున వచ్చిన ఒక నరనాథుడు అంతకుముందే ఆ



Scanned with CamScanner

కారాగృహంలో ఉన్న ఒకఖైదీతో.

అంతకు ముందునుంచి ఉంటున్న ఆ ఖైదీ సూర్యవంశసంజాతుడు చెప్పిన గాథను విని భావనిబిడమైన మందహాసం చేశాడు. క్రొత్తగా వచ్చిన ఖైదీముఖంలోకి చూసి, తిరిగి తనదృష్టిని క్రిందికి మరల్చి భూమి గీకుతూ కూర్చున్నాడు.

మొదటి బంధితుడు కొన్ని వత్సరాలనుంచి కారాగృహ సౌఖ్యం అనుభవిస్తూ ఉన్నాడు. బంధితుడైన నాటినుండీ అతడు మాట్లాడటమే మానివేశాడు. క్షురకర్మ లేకపోవటంవల్ల అతని జుట్టూ, గడ్డం, మీసాలు అన్నీ పెరిగిఉన్నాయి. అతనివదనంలో వింతకాంతు లేవో ప్రజ్వలిస్తున్నాయి.

క్రిందటి దినానవచ్చిన క్రొత్తఖైదీతో మొదట మాట్లాడనే లేదతడు. ప్రక్కన తనలాంటి ఒక నరజీవి వాసం ఉన్నప్పుడు మాట్లాడటానికి కావలసినంత అవకాశముండటం చేత అతనికి నిశ్శబ్దాన్ని భరించటం కష్టమని తోచింది. అదిగాక ఇన్నాళ్ళు అనుభవించిన ఏకాంత జైలువాసంతో తన భాషనేమైనా మరచి పోయాడేమోనన్న సందేహంరాగా తనను తాను పరీక్షించు కుందామని గొంతు సరిచేసుకుని బహుప్రయత్నంతో 'ఎవరండీ మీరు? ఎందుకిచ్చటికి తేబడ్డారు?' అని అడిగే సరికి ఆవచ్చిన మనిషి తన గాథనంతా సమయం మించితే దొరకదన్నట్లు ఏకరువు పెట్టాడు.

క్రొత్తఖైదీ వాగుతూన్నంతసేపు మొదటివ్యక్తి మౌనంగా కూర్చుని వింటున్నాడు. మధ్యమధ్యన తలెత్తి చూశాడతనివైపు. మాట్లాడుతూన్నపుడు అతని ముఖంలో కనిపిస్తున్న వివిధకవళికలను అతని మాటల్లోని అహంభావాన్ని పూర్తిగాకనిపెట్టాడు. ఉపన్యాస ధోరణిలో చెప్పిన అతని గాథనువిని ఏ అభిప్రాయమూ వెలిబుచ్చలేదు సరికదా, 'పాపం' అని సానుభూతైనా చూపలేదు.

ఆరోజంతా తిరిగి నిశ్శబ్దంతోనే గడిచింది. తన గాథను వెల్లడిచేసిన నృపాలునికి లోలోన ఏదో ఉత్సుకత రగిలింది. మరుసటి రోజున వీలుచూసి "నీవెవరవయ్యా ఎందుకీ కారాగృహవాస మనుభవిస్తున్నావు?" అని ప్రశ్నించాడు. ఒకనాడు తాను "రాజు' అనే అహంభావంచేత మొదటి ఖైదీని "మీరు" అని సంబోధించలేక పోయాడు.

నరపాలుని నడత నెరిగిన ఆ మొదటిఖైదీ క్రిందటి రోజు అతడుపన్యసించిన దానికి తగిన నిష్పత్తిలో వ్యంగ్యంగా తన జీవితముఖ్యఘట్టాల్ని, వంశం పుట్టుపూర్వాల్ని ఇలాచెప్పాడు:

"చాలాగొప్ప ప్రశ్న. మీ ప్రశ్నకు బదులివ్వటం నా శక్తి దూరమైంది కావచ్చు.



Scanned with CamScanner

అయినా మీరు కోరుతున్నారు కనుక సంక్షిప్తంగా నైనా తెలుపటం భావ్యం. వినండి:

"మా వంశపు పుట్టుకను ఎవరూ అంతుతీయ లేరు. సృష్టి ప్రారంభమైనప్పుడే మా వంశంగూడా రూపం దాల్చినదని చెబితే సత్యదూరం కాదేమో! ఈనాటికీ దినదిన ప్రాబల్యం వహిస్తూవుంది.

"మాది నిశ్శ్రీకవంశం. సూర్యచంద్ర వంశజులయిన వారికంతా మధ్యలో బ్రాహ్మణులు కల్పించిన శాఖలు ఆధారమని పరిశోధనల మూలంగా నొక్కి చెప్ప వచ్చు. కాని మా నిశ్శ్రీకవంశం మాత్రం అలాంటి కల్పనకు దూరంగా ఉంది.

"నేను నిశ్శ్రీక వంశంలోని రాజును. రారాజును. క్షుద్బాధా సామ్రాజ్యాధిపతిని. నా సామ్రాజ్యంలో లెక్కకు మించిన రాజులున్నారు. వారందరూ నా ఆశయాలతో ఏకీభవించి, పురోగమించటానికి సర్వావస్థలలోనూ సిద్ధంగా ఉంటారు. నా కనుసన్నతో జీవితాన్ని బలిచేయటానికి వెనకాడరు.

"మేము ప్రతిష్ఠ, అప్రతిష్ఠ, ముక్తి, భక్తి ఇత్యాది ఆముష్మిక విషయాలలో ఏమాత్రమూ జోక్యం కలిగించుకోము. గతాన్నిమరచి, ప్రస్తుతాన్ని తలంచి భవిష్యత్తులోకి చూస్తాం. మాకర్తవ్యం అవిరామకృషి. తత్ కృషి ఫలితాన్ని ఏ సహస్రాంశమో మేమనుభవిస్తాం. మిగిలినదంతా ఎవరో అనుభవిస్తారు. అడుగైనా కదల్చకుండా మూడుపూటల మెక్కుతున్నారుగదా అని అక్కసుపడము. ఎవరో సాటిసోదరులు బ్రతికిపోతున్నా రనుకుని తృప్తిపడతాము. అంతేకాని చేతగాని తనం మాత్రంకాదు.

"ప్రపంచంలోని ప్రతివింతనూ మేం కల్పించాం. తాజ్ మహలును మేం నిర్మించాం. కోహినూరును మేం వెదికితెచ్చాం. ఒకటేమిటి? అన్నీ ప్రపంచంలో ఏవేవైతే గొప్పలుగా పరిగణింప బడుతున్నాయో, వాటికన్నింటికీ మూలపురుషులం మేమే. అయినా, కొందరు వాటిపై తమ నామాల్ని స్వోత్కర్షకై చెక్కుకున్నారు. మేమేమీ అడ్డుపెట్టలేదు. ఎవరిపేరైతేనేం? కావాల్సింది లోకకళ్యాణం.

"మాకెప్పుడూ కంటినిండా నిద్రలేదు; కడుపునిండా కూడులేదు, ఒంటినిండా గుడ్డాలేదు. దానికై మేమెన్నడూ వగవలేదు. ప్రజానీకం సౌకర్యానికి పునాదులువేసి సువిశాలహర్మ్యాలు నిర్మిస్తూ పోయాం. అది మాధర్మం.

"కళాకారుల్ని మే మెప్పుడూ ఫలానాది చేయమంటూ నిర్బంధించలేదు. వారు వారికి తోచిన త్రోవలుత్రొక్కారు. కళకు హద్దులుగీయటం భగవంతునికి



Scanned with CamScanner

ద్రోహంచేయటమని మా అభిప్రాయం. గద్యమైనా, పద్యమైనా భావప్రకటనమే ముఖ్యమని ఒప్పుకున్నాము. ఎటువంటి గీతలయినా సరే సహజత్వాన్ని చిత్రించగలిగితే అదే కళంటూ ఆమోదించాము. హృదయాలు మాట్లాడుకునే భాషకు అసలు నుడులేయుండవు. అంతమాత్రాన అది అర్థరహితమైందని అనలేము. మనోఫలకాలపై శాశ్వతంగా చిత్రించుకునే చిత్తరువులకు గీతలు, రంగులు అవసరమే కావు. అయినా వానిలో సహజత్వం లోపించిందనుట పొరపాటు. ఊహాగానాలతో కారుమేఘాల నీలి అంచులమీద చేసే నృత్యాన్ని కళల్లో జమకట్టకండా ఉండలేము. మొత్తానికి తమకళకు సార్థకత, సౌమ్యత, ప్రత్యేకత కావాలనుకున్న వారంతా మా జీవితాల్ని తమకళల్లో రూపెత్తించారు. మేము వారిని కోరలేదు. నిశ్శ్రీక సౌఖ్యాల్నినుభవించి వారెన్నడూ విసుగుజెందలేదు.

“ఆమధ్యలోనే ఎవరో తానందరికీ రాజు నంటూ తలెత్తాడు. ఇందరము రాజులముండగా ఇతడెవడని మేం దిగులుపడలే. కళ్లెల్లచేయలేదు. మాలో కొందరతని సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. అతడు వారికి కొన్ని కపటాశలు గొల్పినట్లు తరువాత తేటపడింది. ఆనాడు ‘ఎవరైతేనేం? రాజు, రారాజు; ఎంతవాడైతేనేం? సాటివారికి హాని కలిగించకుండా ఉంటేచాలు’ అనుకొని ‘అవును నీవే రాజు’వన్నాము. అతని రాచరికాన్ని ఒప్పుకోవటాని కింకో కారణముంది. అతడు ప్రదర్శించిన కొన్ని యుక్తులు మాపై మత్తుగా పనిచేసినయి. తన తెలివితేటలతో మా కొఅకు స్వర్గానికి దారి కడతానన్నాడు. మా ముఖాలు ఏదో క్రొత్త ఆశతో జేవురించినయి. ‘అవు’నంటే ‘ఔ’నన్నాం. అతడు తనకు సౌఖ్యం కావాలన్నాడు. ఇచ్చాం. అందరూ తన చెప్పుచేతల్లో కట్టుబడి ఉండాలన్నాడు. హేతుబద్ధమైన మాటలన్నిటినీ పాటిస్తామన్నాము. ఆవిధంగా సాగింది కొన్నాళ్లు. అతని ప్రభావం ప్రేళ్లుతన్నింది.

“ఆలోగా అతడు కొంతధనాన్ని అనుచరుల కంతా ఆశచూపి తన సంఘాన్ని బలపరచుకున్నాడు. అర్థంలేని సౌఖ్యాల్ని తాననుభవిస్తూ ఇతరులకు ఇక్కట్లు ఇనామివ్వసాగాడు. నాకేమీ అర్థంకాలేదు. నాతోటివారితో ఆలోచించాను. ‘అతడు సార్వభౌముడనంటూ ఇష్టమొచ్చినట్లల్లా ప్రవర్తిస్తున్నాడు. ఏం చేద్దామా?’ అని జరుగుతూ వచ్చిన పరివర్తనను గమనించకుండా నిద్రమత్తులో ఉన్న ప్రజల్నొకసారి మేల్కొల్పానుకున్నాం. కవులు వైతాళికులయ్యారు. ప్రాభాతగీతాల్ని వింటూ, నిద్రసం కెళ్లను సడలించుకుని తమ సౌఖ్యాల్ని మంటగలిపిన భూతానికి శాస్తి చెయ్యాలని తయారౌతూన్న వారిని పశుబలం ఉపయోగించి బంధించాడతడు. కాల్పించాడు.



Scanned with CamScanner

సార్వభౌముడనేవాడిని ఒకసారి ముఖాముఖిగా కలుసుకుని 'ఏమిటిదీ?' అని ప్రశ్నిద్దామనుకున్నా' కాని అతనిదాకా పోవటానికి వీలు చిక్కలే. అతడే కోటలో ఉంటాడో నాకు తెలీదు. అతని భటులు నన్ను గెంటారు. రాజ్యంలో జరుగుతూన్న రాపిడికి మూలం నేనేనంటూ నన్ను బంధించి ఈ ఇనుప సంకెళ్లతో బిగించారు. సార్వభౌముడు తనదారిలోని కంటకం దూరమైందని వికటహాసం చేశాడట.

"నన్ను బంధించటంతో నాపై సానుభూతి గలవారంతా విజృంభించారు. బుద్ధి గడ్డితిని అతడ్ని అనుసరించిన వారిలో కొందఱు తమ తప్పిదాన్ని తెలుసుకుని రాజు కెదురు తిరుగుతూన్నట్లు ఒకనా డెవరో అనుకుంటూంటే విన్నా. రోజు రోజుకు చెలరేగుతూన్న మా వంశీకుల విప్లవం నా అంత:చక్షువుకు స్పష్టంగా గోచరిస్తూ ఉంది. ముమ్మందు విజయలక్ష్మిని చేపట్ట గలరనే దృఢ నమ్మకం గలుగుతూంది.

తన గాథను వివరించి ఎదుట కూర్చునివున్న నృపతి వైపు చూశాడు మొదటి ఖైదీ. రాజేదో విస్మయంలో మునిగినట్లుంది. ఇరువురి జీవితాలు వైరుధ్యంగా ఉండటంవల్ల ఇక ఎవ్వరూ మాట్లాడుకోలేదు ఆనాటికి.

ఆనాటికేగాదు; వారిక ఏనాటికీ మాట్లాడుకోలేదు. తన కెదురు తిరిగి శ్రమికలోకంలో విప్లవ జ్వాలలు రగిల్చిన నాయకుడు అతడేననీ, అతన్ని బంధించింది తానేననీ ఆ క్రొత్తగా వచ్చిన ఖైదీ గ్రహించలేక పోయాడు. తన్ను జైలులో త్రోసింది ఆ నరవరుడేనని నిర్శ్రీక వంశీయుండూ తెలిసికోలే. కాని ఎదుటనున్న జనాధిపుడి వంటి వాడిచేతనే అతడు శిక్షింపబడ్డాడని మొదటి ఖైదీ, నిర్శ్రీకుని లాంటి ఆశయాలు గల వ్యక్తినే తాను నిర్బంధించానని రెండో ఖైదీన్నూ పైపైగా గ్రహించి తమకు పరస్పరం పొత్తు ఏమాత్రమూ పొసగ వీలులేక ఎవరికి వారే తామాచరించిందే న్యాయబద్ధమైందని తలంచి, ఏనాటికైనా తాము బయటపడతామనే బలమైన నమ్మకంతో కాలం గడుపుతున్నారు. వారిరువురిలో ఒకరిది వెలుగు, మరొకరిది చీకటి; ఒకరిది అభ్యుదయం, మరొకరిది పతనం; ఒకరిది శాశ్వతం, మరొకరిది క్షణికం.

కాల చక్రం దొర్లిపోయింది. రోజులు, నెలలు, వత్సరాలూ గడిచినయి. ఒకనాడు ప్రజానీకమంతా జయధ్వానాలు చేస్తూ జైలు ఉన్న కోటలోనికి ఉప్పొంగిన సంద్రంలా వచ్చింది. ఎవ్వరూ అడ్డు పెట్టలే. ఆ గది తాళం తీశారు. మొదటి ఖైదీకి పూలమాలలు మెడనిండా వేసి, భుజాలపై ఎత్తుకుని ఉత్సాహంతో 'శ్రామికలోకానికి జై'అనే

నినాదాలతో మోసుకుపోయారు. తలుపులు తిరిగి బిగింపబడినయి. తన కళ్లెదుట జరుగుతున్న దేమిటో అర్థంకాక–అన్యాయమని జైలు కటకటాల్లోంచి విస్మయం, సంభ్రమంతో చూస్తూ ఉండిపోయాడా నరపతి, ఆ సూర్యవంశపు రాజు.

*(డిసెంబర్ 17, 1954 తెలుగు స్వతంత్ర)*

Scanned with CamScanner